క్లుప్తంగా

దేశాభివృద్ధికి సంస్కరణలు అవసరం



పోలీసు, న్యాయశాఖల సిబ్బందికి శిక్షణను ప్రారంభిస్తున్న ఎల్జీ రాధాకృష్ణన్

యానాం: దేశాభివృద్ధికి ఆర్థిక, న్యాయ, ఎన్నికల శాఖల్లో సంస్కరణలు అవసరమని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శనివారం కదిరిగమమ్‌లో ఇందిరాగాంధీ ప్రభుత్వ ఆసుపత్రి, పరిశోధన సంస్థ సెమినార్ హాలులో కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రవేశపెడుతున్న మూడు ఇండియన్ పీనల్ కోడ్స్(ఐపీసీ) అమలు గురించి రెండు రోజుల పాటు పోలీసు, న్యాయశాఖల సిబ్బందికి నిర్వహించే ప్రత్యేక శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులకు వ్యతిరేకంగా సాక్ష్యాలున్నా వారు ప్రస్తుత చట్టాల వల్ల కొన్నిసార్లు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకే నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోకుండా బాధితులకు న్యాయం జరిగేలా చట్టాలను సవరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్, డీజీపీ పి.శ్రీనివాస్, న్యాయ కార్యదర్శి ఎల్ఎస్ సత్యమూర్తి, ఐజీ అజిత్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు శాంతి కల్యాణం

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైశాఖ మాసం శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 19 ఆదివారం రోజున శాంతి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు శనివారం తెలిపారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బాలపురస్కార్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పి.ముత్తుమీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా జూలై 31లోగా అభ్యర్థులు దరఖాస్తులను పంపాలని కోరారు. క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్ అండ్ కల్చర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ బాలలు అవార్డుకు అర్హులన్నారు.

తపో ఆశ్రమంలో బ్రహ్మంగారి సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ముమ్మిడివరం: స్థానిక భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో శనివారం బ్రహ్మంగారి సమారాధన ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద బ్రహ్మంగారి శిష్య బృందం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాల యోగీశ్వరుల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీచర్ల ఇన్‌సర్వీస్ శిక్షణకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి నాలుగు రీజియన్లలో ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో టీచర్లకు ఇన్‌సర్వీస్ శిక్షణ ఇచ్చేలా స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ సర్వీసు శిక్షణకు సంబంధించి మార్గదర్శకాలు గురించి స్టీరింగ్ కమిటీ వివరిస్తుందన్నారు. ఈ స్టీరింగ్ కమిటీకి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు. అదేవిధంగా విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్, అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ



కొత్తపేట సబ్‌జైలులో ఖైదీల సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి

కొత్తపేట: స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సౌకర్యాలు, వసతి, భోజన సౌకర్యాలు గురించి సబ్‌జైలు అధికారులు, సిబ్బందిని ఆరా తీసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. వారిపై మోపబడిన నేరాలు, కేసులు, రిమాండ్ కాలం తదితర అంశాల గురించి ఆరా తీశా రు. అవసరమైతే ఉచిత న్యాయ సహాయం సౌకర్యం కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని, ఇకపై సత్ప్రవర్తనతో మెలిగి భవిష్యత్‌లో మంచి జీవితాన్ని గడపాలని సూచించారు.

అధిక ఉష్ణోగ్రతలతో హడల్

- వేసవి తాపానికి ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ లోపం
- ఆందోళనకు గురవుతున్న రైతులు



ఉప్పలగుప్తంలో పట్టిన వెనామీ రొయ్యలు



ఆక్వా చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

ఉప్పలగుప్తం: ఆక్వా రైతుకు కలిసొచ్చే సాగు ఏదైనా ఉందంటే అది వేసవి సాగు. జనవరి నుంచి జూన్ వరకూ జరిగే సాగులో ప్రకృతిపై రైతులు పూర్తి నమ్మకాన్ని పెట్టుకుని సాగు సాగిస్తారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు ఆక్వా రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆ వెంటనే మళ్లీ భానుడు ఉగ్రరూపం దాల్చాడు. రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు చెరువుల్లోని రొయ్యలు, చేపలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు చెరువు నీటిలోని ప్లాంటేషన్ తగ్గిపోవడంతో నీరు పలచబడి నేరుగా సూర్యరశ్మి చెరువు అడుగు భాగానికి చేరుతుంది. దీనివల్ల మట్టి పాచై తెట్టులుగా పైకి చేరుతుంది. దీంతో చెరువు నీటి నాణ్యత, మట్టి నాణ్యత దెబ్బ తింటుంది. చెరువుల్లోని ప్లాంటేషన్ క్రాస్ కావడంతో జలచరాలు మేత సకాలంలో తినడం లేదు. మరోవైపు అధిక ఉష్ణోగ్రతల వల్ల అప్పుడప్పుడు కరెంట్ ట్రిప్ అవుతుండడం వల్ల ఆక్సిజన్ లోపం వచ్చి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో మృత్యువాత

అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, అమలాపురం మండలాల్లో సుమారు 28 వేల ఎకరాల్లో రైతులు మిశ్రమ పద్ధతిలో రొయ్యలు, చేపల సాగు(పాలికల్చర్), వెనామీ రొయ్యలు ఆక్వా సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం భగ్గుమంటున్న భానుడి కారణంగా ఎండలకు చెరువు నీటి, మట్టి నాణ్యత లోపించడం, ఆక్సిజన్ స్థాయి తగ్గడం, డెడ్ ఆల్గే, విషవాయువులు విజృంభించడంతో వెనామీ రొయ్యల సాగులో వైట్ గట్, సెల్ లూజ్, రెడ్ గిల్, బ్లాక్ గిల్, హిబ్రియో వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు, విషవాయువుల స్థాయి తగ్గించేందుకు అధిక ఖర్చుతో జియోలైట్, శానిటైజర్స్ వంటి మందులను వాడాల్సి వస్తుందంటున్నారు. ఎండలకు చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. చెరువుల్లో రైతులు ఏరియేటర్లతో ఆక్సిజన్‌ను అందిస్తారు. అయితే విద్యుత్ ట్రిప్ అవుతున్న సమయాల్లో ఆ అవకాశం లేకపోతుంది. రొయ్యల చెరువుల్లో వెనామీ రొయ్యలు రన్నింగ్ మోర్టాలిటీతో ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది



నేను 9 ఎకరాల్లో పాలీకల్చర్(చేప, రొయ్య మిశ్రమ సాగు), 5 ఎకరాల్లో వెనామీ రొయ్య సాగు చేస్తున్నాను. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అందుకే ఫీడింగ్ తీసుకున్న సమయం మినహాయించి మిగతా సమయాల్లో అధికంగా ఏరియేటర్లు తిప్పుతున్నాను.

– సుందరనీడి సురేష్, ఆక్వా రైతు, ఉప్పలగుప్తం

పెట్టుబడి పెరిగిపోతుంది



నేను ఎనిమిది ఎకరాల్లో వెనామీ కల్చర్ చేస్తున్నాను. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంతో సీడ్ ఎదుగుదల తక్కువగా ఉంది. దానికి తోడు వైట్ గట్ సోకటంతో మేతలు తీసుకోక ఇబ్బంది పడుతున్నాను. ఈ కారణాల వల్ల పెట్టుబడి సైతం భారీగా పెరిగిపోయింది.

– కాకిలేటి పాపారావు, ఆక్వా రైతు, సామంతకుర్రు

రైతులు తరచుగా గమనించుకోవాలి

రైతులు రోజూ చెరువులో ఉన్న నీటి, మట్టి నాణ్యతను గమనించుకోవాలి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తరచుగా ఏరియేటర్లను తిప్పుతుండాలి. చెరువు నాణ్యతను, అవసరాన్ని బట్టి శానిటైజర్స్, మినరల్స్, ప్రొపోడిక్స్ చెరువుకు అందించాలి.

– సీహెచ్ గోపాలకృష్ణ, ఎఫ్‌డీవో, ఆక్వా ల్యాబ్, అమలాపురం

బ్యాటరీ కారు ఆవిష్కరణ



విద్యార్థులు తయారు చేసిన బ్యాటరీ కారుతో అధ్యాపక బృందం

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణల ప్రదర్శన శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన డాక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలో నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. విభిన్న ప్రతిభావంతులు సులభంగా వినియోగించుకునేలా రూపొందించిన వీల్‌చైర్, విద్యార్థులు స్వయంగా తయారుచేసిన బ్యాటరీ కారును ప్రదర్శించారు. అవి అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బ్యాటరీ కారు రూపొందించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ కృష్ణ సతీష్, డీన్ టీవీ జనార్ధనరావు, డాక్టర్ ఆలపాటి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి ఏవైఆర్‌వీ ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, బీఎస్ఎన్ మూర్తి, సుబ్బారావు, శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

కాట్రేనికోన: మండలంలోని పల్లం గ్రామంలో శనివారం కాట్రేనికోన ఎస్ఐ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో రికార్డులు లేని 30 మోటారు సైకిళ్లు, 10 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కాట్రేనికోన ఎస్ఐ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేని వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు.

వేంకటేశ్వరుని గ్రామ ప్రదక్షిణ



బండారులంకలో గ్రామ ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతీ అలిమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల సందర్భంగా శనివారం గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి, అమ్మవార్లను వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమైన వాహనోత్సవం వీరభద్రస్వామి గుడి సెంటర్, హైస్కూల్ సెంటర్, మురుగులమ్మ గుడి సెంటర్, సాయిబాబా గుడి సెంటర్ మీదుగా కాపటి వీధి, శివాలయం వీధి వరకూ సాగింది. దారి పొడవునా అత్యధిక సంఖ్యలో మహిళలు స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. తొలుత స్వామి, అమ్మవార్లకు లక్కింశెట్టి ఫణిరాజు, హేమ నాగలక్ష్మి దంపతులచే సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిపారు. వాహన సేవలో మురుగులమ్మ గుడి సెంటర్ యూత్, శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు అంకం నాగ సత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, నల్ల శేషయ్య, కాసిన ప్రసాద్, దైవపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి కలశ స్థాపన

ఆదివారం ఉదయం 6.14 గంటలకు స్వామివారి కలశస్థాపన నిర్వహించనున్నట్లుశ్రీనివాస బాలమిత్రుల సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, లక్కింశెట్టి పనిరాజు తెలిపారు. ఈ నెల 25న స్వామివారి దివ్య కల్యాణం, 26న పుష్పయాగం, 27న హోమాలు, రథోత్సవం జరుపుతామన్నారు.

వరి గడ్డికి యమ డిమాండ్



వరి చేలో యంత్రాలతో చుట్టిన గడ్డి మోపులు



ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి మోపులు

ముమ్మిడివరం: మారుతున్న కాలంలో పెరిగిన సాంకేతికత వల్ల వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ఫలితంగా పశువులకు ఎండు గడ్డి కొరత ఏర్పడుతుంది. గతంలో మనుషులతో వరి పంటను కోసి ట్రాక్టర్లతో నూర్పించేవారు. అప్పుడు ఎండు గడ్డి పుష్కలంగా లభించేది. దాన్ని పశుగ్రాసంగా ఉపయోగించుకునేవారు. అయితే మనుషుల కూలీ రేట్లు విపరీతంగా పెరగడం, వరి కోత మెషీన్లతో గంటల వ్యవధిలోనే పని పూర్తవుతుండడంతో రైతులంతా యంత్రాల వినియోగానికే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. మరోవైపు పాడి రైతులు దాణా ఖర్చులు తట్టుకోలేక మెషీన్ ద్వారా కోసిన గడ్డిని, యంత్రాల ద్వారా మోపులుగా చుట్టించి పశువులకు కావలసిన ఎండు గడ్డిని సమకూర్చుకుంటున్నారు. ఇలా మోపులు కట్టడానికి ఒక మోపుకు 35 రూపాయలు చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక ఎకరా పొలంలో గడ్డికి రూ.6,000 నుంచి రూ.7,000 వరకూ ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పైగా అంత ఖర్చు పెట్టినా అవసరానికి తగ్గట్టు ఎండు గడ్డి దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



మురమళ్ల కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో తాళ్లరేవు వాసవీ మాత



వాసవీమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న వాసవీమాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వాసవీ క్లబ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోకవరపు సుభాష్, వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ ఎస్.నాగాంబిక తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు సామూహిక కుంకుమ పూజ, పారాయణ చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రజత రవి పత్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలలో తాళ్లరేవు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వాసవీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జన్మదిన వేడుకలు

ఐ.పోలవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆర్యవైశ్యులు ఆరాధంగా కొలిచే కులదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మురమళ్ల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గ్రామానికి చెందిన వైశ్య కుటుంబాలు ఉదయాన్నే భక్తిశ్రద్ధలతో తమ ఇళ్ల వద్ద నుంచి పలు రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లు తెచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పండితులు నాగాభట్ల శ్రీరామశర్మ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పల్లకిలో అమ్మవారిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ సత్యకృష్ణ

ఉప్పలగుప్తం: విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనం అలవరచుకోవాలని ఎంఈఓ సత్తి సత్యకృష్ణ అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి పూజ నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల, దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకూ రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకూ వేసవి శిక్షణా శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ తెలుగు లెక్చరర్ నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల్ని గుర్తించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని

అమలాపురం రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఉపాధ్యాయులు గుర్తించాలని రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గని సూచించారు. శనివారం అమలాపురం మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గురించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లల్ని ఎలా గుర్తించాలో, అనంతరం దగ్గరలో ఉన్న పాఠశాల లేదా భవిత కేంద్రాల్లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్.దుర్గాదేవి మాట్లాడుతూ ఈ పిల్లలకు సేవ చేయటం దేవుడు ఇచ్చిన గొప్ప వరమన్నారు. జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా 137 మంది పిల్లల్ని గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

పెదపూడి: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టేవారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపడతామని తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపరలో నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఘనంగా శత జన్మదిన వేడుకలు



రత్నం పుట్టినరోజు వేడుకల్లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

సఖినేటిపల్లి: వందేళ్లు పూర్తి చేసుకున్న తండ్రికి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీకి చెందిన దొండపాటి రత్నం 100 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి వేడుకలను గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధుమిత్రుల మధ్య శనివారం ఘనంగా నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, గొల్లమందల విజయరత్నం, రమేష్ బాబు, కుసుమ రాకేష్, కుటుంబ సభ్యులు సువర్ణ రత్నం, మేరీ సుజాత, రత్నకుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

అంబాజీపేట: శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందాలతో నామస్మరణాల మధ్య వెంకన్న కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం, వేద మంత్రోచ్చారణ నడుమ, మంగళ వాయిద్యాలతో, గోవింద నామస్మరణతో వెంకన్న కల్యాణం కన్నుల వైకుంఠంగా సాగింది. వందలాది మంది మహిళలు స్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఆదివారం స్వామి వారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.